క్లుప్తంగా

రాష్ట్రస్థాయి చెస్‌పోటీలకు ఎంపిక



విద్యార్థి తారుష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

కోవెలకుంట్ల: పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గీతా తెలిపారు. ఇటీవల నంద్యాలలోని నెరవాటి హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి చెస్ పోటీల్లో పాఠశాలకు చెందిన నాల్గో తరగతి విద్యార్థి తారుష్ ప్రతిభ చాటి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడన్నారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థిని హెచ్‌ఎంతోపాటు ఫిజికల్ డైరెక్టర్లు హర్ష, ఓబులేసు, ఉపాధ్యాయులు అభినందించారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడులో వెలసిన పద్మనాభస్వామి ఆశ్రమంలో ఈ నెల 10వ తేదీ గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం పద్మనాభస్వామికి అభిషేకం, పంచ బ్రహ్మలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం, హోమం, మంగళహారతి, స్వామివారి పల్లకీసేవ, తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

10న పేరెంట్స్ మీటింగ్

కొలిమిగుండ్ల: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 10న నిర్వహించే పేరెంట్స్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని ఎంఈఓ అబ్దుల్ కలాం అన్నారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చేలా చూడాలని సూచించారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం




మృతుడు రమేష్ భార్యకు ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రులు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన రమేష్ (30) ఇటీవల ఈతకి వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న రమేష్ మరణంతో భార్య భాగ్యలక్ష్మి సహా కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లింది. ఈ నేపథ్యంలో 2007–2008లో వెల్దుర్తి మండల జెడ్పీ హైస్కూలు సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో 10వ తరగతిలో చదువుకున్న రమేష్ తోటి మిత్రులు ఆదివారం రూ.55,000 విరాళంగా సేకరించి, సోమవారం మృతుని భార్యకు అందజేశారు. ఆపద సమయంలో మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన హాస్టల్ స్నేహితులకు పలువురు అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బేతంచెర్ల: నాపరాయి ఫ్యాక్టరీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో నాపరాయి పరిశ్రమల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ ఓనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గౌరి హుసేన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కాలంలో నాపరాయి పరిశ్రమపై ఉండే 18 శాతం జీఎస్టీని అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి 5 శాతానికి తగ్గించి ప్రోత్సాహం కల్పించారని చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయంలో మైనింగ్ లీజుల పునరుద్ధరణ జరగకపోవడం, పర్యావరణ అనుమతులు మంజూరుకాకపోవడం వంటి కారణాలతో పరిశ్రమలు తీవ్ర సంక్షోభంలో ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బేతంచెర్ల నాపరాయి పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు ఉందని, పరిశ్రమల రాయల్టీ వే బిల్లులు, పర్యావరణ అనుమతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అయితే సమావేశానికి తక్కువ సంఖ్యలో పరిశ్రమల యజమానులు హాజరుకావడంపై అసహనం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు



నూతన బైక్‌లను ప్రారంభిస్తున్న డీఎస్పీ

డోన్ టౌన్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని.. తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ట్రాఫిక్ నిర్వహణకు ప్రభుత్వం నుంచి వచ్చిన రెండు బైకులను సోమవారం ఆయన పూజలు చేసి ప్రారంభించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం పట్టణంలో ప్రత్యేకంగా సిబ్బందిని, బ్లూకోర్ట్ వాహనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక.. జియారత్

- రేపటి నుంచి దస్తగిరి, మౌలాలి స్వామి జార్తలు
- ముస్తాబైన దర్గాలు
- రెండు రోజులపాటు నిర్వహణ



వేడుకలకు ముస్తాబవుతున్న దస్తగిరిస్వామి దర్గా





దర్గాల్లో కొలువుదీరిన దస్తగిరి స్వామి, మౌలాలిస్వామి పీర్లు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో మొహర్రం పండుగను పురస్కరించుకుని మత సామరస్యానికి ప్రతీకగా ఏటా నిర్వహించే జియారత్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొహర్రం ముగిసిన మూడో రోజున నిర్వహించే ఈ జార్తలు బుధవారం ప్రారంభమై రెండు రోజుల పాటు వైభవంగా కొనసాగనున్నాయి. గ్రామంలో వెలసిన దస్తగిరిస్వామి, మౌలాలిస్వామి దర్గాల్లో స్వామివార్ల జియారత్‌కు దర్గా కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

రేపటి నుంచి జార్తలు

బుధవారం ఉదయం మాబుసాని సమాధి, దస్తగిరి, మౌలాలిస్వామి పీర్లకు ఫాతేహాలు సమర్పించి, పూల దట్టీలు, వెండిగొడుగులు అలంకరించి ఊరేగింపుగా స్వామివార్లకు తీసుకెళ్తారు. మధ్యాహ్నం దస్తగిరి స్వామి కార్యనిర్వాహక కమిటీ సభ్యులు తెలుగు మద్దిలేటి, పల్లె నాగరాజు, పలగాటి డ్రైవర్ ఉసేని,తుమ్మల పెద్ద దస్తగిరి, మాబుసా పూజారు లు కందూరు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు భక్తులు చావిళ్లను చేరుకుని స్వామివార్లకు ఫాతేహా లు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. అదే రోజు అర్ధరాత్రి నుంచి స్వామివార్ల ఊరేగింపు ప్రా రంభమై గురువారం సాయంత్రం వరకు కొనసాగుతుంది. అనంతరం పీర్లను చావిళ్లలో కొలువుంచడంతో జార్తలు ముగియనున్నాయి. జియారత్ వేడుకలకు ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు వైఎస్సార్ జిల్లాలోని జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, అనంతపురం, తాడిపత్రి, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వేలాది భక్తులు తరలివచ్చి దస్తగిరిస్వామి, మౌలాలిస్వామిల దర్శనం చేసుకుని పూలదట్టీలు, వెండిగొడుగులు సమర్పించనున్నారు.

దస్తగిరి పీరుకు ప్రత్యేక చరిత్ర

పూర్వీకుల కథనం మేరకు, గ్రామానికి చెందిన మాబుసాని అనే భక్తుడు చేతిలో నిప్పులు పోసుకుని వెండిని కరిగించగా, ఆచారి అనే మరో భక్తుడు దస్తగిరిస్వామి పీరును తయారు చేశారని చెబుతారు. ఈ పీరును దొంగల ముఠా చోరీ చేసి నొస్సం కొండల్లో వెండిని కరిగించేందుకు ప్రయత్నించగా, వారు చూపు కోల్పోయినట్లు చరిత్ర చెబుతోంది. తర్వాత మాబుసాని స్వప్నంలో స్వామి దర్శనమిచ్చి ఆ పీరును తిరిగి తీసుకొమ్మని ఆదేశించగా, భక్తులు అక్కడికి వెళ్లి పీరును తిరిగి తీసుకొచ్చి దర్గాలో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచే ఏటా ఈ జియారత్ వేడుకలు ప్రత్యేకత సంతరించుకున్నాయి. తెలుగు లక్ష్మన్న, పల్లె కొనంగి సుబ్బరాయుడు, పలగాటి ఉసేని విరాళాలతో దస్తగిరిస్వామి దర్గాను నిర్మించగా, అనంతరం మౌలాలిస్వామి పీరును కూడా ప్రతిష్ఠించి మాబుసాని వంశీయుల ఆధ్వర్యంలో జార్తలు నిర్వహిస్తున్నారు.

ముగిసిన మొహర్రం వేడుకలు

అవుకు: మండల కేంద్రంలో పది రోజులుగా ఘనంగా సాగిన మొహర్రం వేడుకలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. వేకువజామునే అవుకులోని తొమ్మిది చావిళ్లకు చెందిన పీర్ల దేవుళ్లు సెంటర్ ప్రదేశానికి చేరుకొని అక్కడి నుంచి తేరువీధి మీదుగా రాజవంశీయుల ఇంటి వరకు సవారీగా తీసుకెళ్లారు. అనంతరం ఆయా పీర్ల దేవుళ్లను తిరిగి కొలువుదీర్చి, సాయంత్రం నిమ్మజ్జనం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తిలో సోమవారం మొహర్రం వేడుకలు ముగిశాయి. గ్రామంలోని దస్తగిరిస్వామి, మౌలాలి స్వామి దర్గాల్లో గత నెల 28వ తేదీ పీర్లను కొలువుంచి తొమ్మిది రోజుల పాటు భక్తులు ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం రాత్రి పెద్ద సరిగెత్తును పురస్కరించుకుని రెండు పీర్ల చావిళ్ల ఎదుట అగ్నిగుండాలు వెలిగించారు. సోమవారం పీర్ల ఊరేగింపు నిర్వహించిన అనంతరం కుందూనదిలో పీర్లను శుద్ధి చేసి తిరిగి చావిళ్లలో చేర్చడంతో మొహర్రం వేడుకలు ముగిశాయి.

ఘనంగా పీర్ల ఊరేగింపు

సంజామల: ఆకుమల్ల, ముదిగేడు గ్రామాల్లో కుల మతాలకు అతీతంగా పీర్ల దేవుళ్లను సోమవారం ఘనంగా ఊరేగించారు. ఆకుమల్ల గ్రామంలోని రెండు చావిళ్లలో సర్కార్ స్వామి, పెద్దఇమాం ఉస్సేన్, ఇమాం కాశీం, మౌలాలిస్వామి, హాజవలి స్వామి ఊరేగింపు అశేష భక్తుల నడుమ సాగింది. వీధులన్నీ కిటకిటలాడాయి. యువకులు డప్పువాయిద్యాలకు చిందులు వేశారు. పీర్ల నిమజ్జనం అనంతరం పీర్లను పెట్టెల్లో ఉంచి ఆయా చావిళ్లలో ఉంచారు.

ఆకట్టుకున్న విషధారణలు

డోన్ టౌన్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వెంకటాపురం గ్రామంలో భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి.



సవారీకి వెళ్తున్న ఇమామ్ ఖాశీం పీర్లు



డోన్: విచిత్ర వేషధారణలో భక్తులు



కోవెలకుంట్ల: దస్తగిరిస్వామి దర్గా ఎదుట అగ్ని గుండం



ఆకుమల్లలో పీర్ల ఊరేగింపునకు తరలివచ్చిన జనం

టీడీపీ నాయకుడి దౌర్జన్యం

- ఎస్సీ శ్మశాన వాటిక సీసీరోడ్డు పనుల అడ్డగింత



టీడీపీ నేత నిర్వాకంతో నిలిచిపోయిన సీసీరోడ్డు నిర్మాణ పనులు

డోన్: వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఉన్న గ్రామాల్లో అభివృద్ధి పనులను అడ్డుకోవడం అధికార పార్టీ నేతలకు పరిపాటిగా మారింది. డోన్ మండలం కన్నపకుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలైన ఎస్సీ మహిళ, గ్రామ సర్పంచ్ కళ్యాణి చేపట్టిన సీసీ రోడ్డు పనులను టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం అడ్డుకోవడం స్థానికంగా కలకలం రేపుతోంది. గ్రామంలోని ఎస్సీ శ్మశాన వాటికకు రూ.4 లక్షల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే టీడీపీ నేత అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. దీనిపై ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, ఏఈ నారాయణను ప్రశ్నించగా ''రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం'' అని సమాధానం ఇవ్వడం గమనార్హం. ఎస్సీ మహిళ ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామంలో అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే అనుచరులు అడ్డుపడడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి అదే పార్టీకి చెందిన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ఫ్లెక్సీ చించిన కేసులో నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే.

జర్నలిస్టుల స్థలాలకే ఎసరు

డోన్: పట్టణంలోని 310–1బీ సర్వే నంబరులో ఉన్న జర్నలిస్టుల స్థలాలపై కొందరు కన్నేశారు. మార్కెట్ ధరకు 2018లో 1.18 ఎకరాల భూమిని 45 మంది జర్నలిస్టులు కొనుగోలు చేశారు. అయితే అప్పటి రెవెన్యూ అధికారిణి నాగమణి అక్రమార్కుల ఒత్తిడికి లొంగి, ఆ భూమిని టీడీపీ నేత గుండ్రాతి కొత్తకోట రామాంజనేయులు పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇది తెలుసుకున్న జర్నలిస్టులు ప్రస్తుతం బేతంచెర్ల తహసీల్దార్‌గా ఉన్న నాగమణిని సంప్రదించగా, 'మీ మేలు కోసమే ఇలా చేశా' అంటూ సమాధానం ఇచ్చినట్లు సమాచారం. జరిగిన తప్పిదంపై స్థానిక ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, ఆర్డీఓ నరసింహులు దృష్టికి తీసుకెళ్లారు. తమ స్థలాలకు రక్షణ కల్పించాలని కోరారు.

చర్చలకు పిలిచి ఆంక్షలు విధిస్తారా

- సీపీఐ, రైతులను అడ్డుకున్న పోలీసులు
- రామ్‌కో ప్రతినిధులతో చర్చలు విఫలం



రోడ్డుపై బైఠాయించిన సీపీఐ, రైతు సంఘం నాయకులు

కొలిమిగుండ్ల: రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తే చర్చలకు ఆహ్వానించి చివరకు ఆంక్షలు విధిస్తారా అని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగమనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం క్రితం సీపీఐ, రైతు సంఘం, ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున రామ్‌కో ఫ్యాక్టరీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ సమయంలో కంపెనీ ప్రతినిధులు వారం తర్వాత చర్చలకు రావాలని సూచించారు. దీంతో సోమవారం కల్వటాల, కొలిమిగుండ్ల, నందిపాడు గ్రామాల రైతులతో కలిసి రామ్‌కో ఫ్యాక్టరీ వద్దకు బయలుదేరారు. అయితే ఫ్యాక్టరీ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులతో అడ్డుకున్నారు. దీంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. తర్వాత కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి పది మంది మాత్రమే లోనికి పంపేందుకు ఒప్పుకున్నారు. ఆ ప్రకారమే పది మందిని ఎంపిక చేసుకుని లోనికి వచ్చేందుకు సిద్ధపడగా మరోసారి కంపెనీ ప్రతినిధులు మాట మార్చి ఇద్దరు మాత్రమే రావాలని చెప్పడంతో వారి తీరుకు నిరసనగా అక్కడే రోడ్డుపై బైఠాయించారు. చర్చలకు పిలిచి అడుగడుగునా ఇలా నిబంధనలు విధిస్తారా అని కంపెనీ ప్రతినిధులపై ధ్వజమెత్తారు. రెండు గంటల పాటు సుదీర్ఘ చర్చలు అనంతరం ఐదు మందితో చర్చలకు ఒప్పుకోవడంతో పోలీసులు వారి జీపులోనే లోనికి తీసుకెళ్లారు. కాలుష్యం వల్ల పంటలకు జరిగిన నష్టపరిహారం చెల్లించడం, భూములు విక్రయించిన రైతుల కుటుంబాల్లో ఉద్యోగాలు ఇవ్వడం తదితర డిమాండ్లను వారి ముందుంచారు. చర్చల్లో కంపెనీ ప్రతినిధుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో సీపీఐ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేసి, చర్చలు విఫలమైనట్లు ప్రకటించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్: స్థానిక పేరంటాలమ్మ గుడి సబ్‌స్టేషన్ వద్ద 33 కేవీ విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా ఈ నెల 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ నాగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనుల నేపథ్యంలో మల్లెంపల్లె ఫీడర్, హైవే ఫీడర్ల పరిధిలోని శ్రీరామ్‌నగర్, టీచర్స్ కాలనీ, వైఎస్సార్‌నగర్, కోట్లనగర్‌తో పాటు లక్ష్మణపల్లె, మల్లెంపల్లె గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా మల్లెంపల్లె ఫీడర్ కింద రైతులకు అందించే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 5 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

ప్యాపిలి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని ప్యాపిలి టౌన్, వెంగళాంపల్లి, ఎన్ రంగాపురం, వెంకటాంపల్లి గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయానికి ఇచ్చే 3 ఫేస్ కరెంట్ ఉదయం 4 నుంచి 10:30 గంటల వరకు.. మళ్లీ మధ్యాహ్నం 1 గంట నుంచి వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

రెయిన్ ఇండస్ట్రీస్‌కు జాతీయస్థాయి అవార్డు



కేంద్రమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కంపెనీ సిబ్బంది

ప్యాపిలి: మండల పరిధిలోని రాచర్ల సమీపంలో ఉన్న రెయిన్ ఇండస్ట్రీస్‌కు జాతీయ స్థాయిలో ఫైవ్ స్టార్ అవార్డు లభించినట్లు పీఆర్‌ఓ కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సోమవారం అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈ మేరకు కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా రెయిన్ ఇండస్ట్రీస్ సీజీఎం చేవూరి మల్లికార్జునరెడ్డి, మైన్స్ డీజీఎం నాగ తులసిరెడ్డి అవార్డును అందుకున్నట్లు తెలిపారు. గనుల నిర్వహణలో శాస్త్రీయ పద్ధతులు పాటించడంతో పాటు సస్‌స్టైనబుల్ డెవలప్‌మెంట్, సీఎస్ఆర్ గ్రీన్ ఎనర్జీ, పర్యావరణ పరిరక్షణకు తీసుకున్న చర్యలకు గాను ఈ అవార్డు దక్కినట్లు పేర్కొన్నారు.

నేడు దివ్యాంగుల పరికరాలకు ఎంపిక శిబిరం

బనగానపల్లె/డోన్ టౌన్: దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందజేసేందుకు మంగళవారం బనగానపల్లె ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో లబ్ధిదారుల ఎంపిక శిబిరం ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ ఎంపీడీఓ సతీష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అర్హత సాధించిన దివ్యాంగులకు ఉచితంగా మూడు చక్రాల సైకిళ్లు, వీల్ చైర్లు, చంక కర్రలు తదితర వాటిని అందజేస్తామన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్, రేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, సదరం సర్టిఫికెట్, దివ్యాంగత్వం కన్పించేలా మూడు ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. నియోజకవర్గంలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఈ నెల 11వ తేదీ డోన్ మండల పరిషత్ కార్యాలయంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు



డీలర్లతో మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకుడు సుధాకర్

అవుకు: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్ హెచ్చరించారు. సోమవారం అవుకు మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో ఎరువుల దుకాణాదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి డీలర్ ఫర్టిలైజర్ డీబీటీ మిషన్ ద్వారానే రైతులకు ఎరువులు పంపిణీ చేయాలని సూచించారు. విత్తనాలు, పురుగుమందులు విక్రయించిన ప్రతి రైతుకూ తప్పనిసరిగా బిల్ ఇవ్వాలని, అమ్మిన ప్రతి బస్తా స్టాక్ రిజిస్టరులో నమోదు చేయాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు విక్రయించినా సంబంధిత షాపులను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. అలాగే కాలం చెల్లిన పురుగుమందులు స్టోర్‌లో ఉండరాదని, వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. డీలర్లు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వాటిని తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. సమావేశంలో అవుకు మండల వ్యవసాయాధికారిణి కలిమున్నీసా పాల్గొన్నారు.

నేటి నుంచి బూత్ లెవల్ అధికారులకు శిక్షణ

డోన్ టౌన్: భారత ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మార్గదర్శకంలో బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలకు) ఎన్నికల విధానాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు డోన్ నియోజకవర్గ పరిధిలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాలకు చెందిన బీఎల్‌వోలకు పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జూలై 8, 9, 11 తేదీల్లో మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డోన్ తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. శిక్షణ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాగుతుందని తెలిపారు. జూలై 8న డోన్ అర్బన్ పరిధిలోని పీఎస్(పోలింగ్ స్టేషన్) 77 నుంచి 126 వరకూ ఉన్న బీఎల్‌వోలకు రూమ్ నం. 3లో, డోన్ పీఎస్ 19 నుంచి 49, ప్యాపిలి 153, 166 పరిధిలోని బీఎల్‌వోలకు రూమ్ నం. 4లో శిక్షణ ఇవ్వనున్నారు. జూలై 9న డోన్ అర్బన్ పీఎస్ 127 నుంచి 134, డోన్ రూరల్ 1 నుంచి 13, 135 నుంచి 152, 198 పరిధిలోని బీఎల్‌వోలకు రూమ్ నం. 3లో, ప్యాపిలి 167 నుంచి 197, బేతంచెర్ల 206, 224 వరకూ ఉన్న బీఎల్‌వోలకు రూమ్ నం. 4లో శిక్షణ ఉంటుంది. జూలై 11న డోన్ రూరల్ పీఎస్ 50 నుంచి 76, బేతంచెర్ల 225 నుంచి 241 వరకూ ఉన్న అధికారులకు రూమ్ నం. 3లో, బేతంచెర్ల పీఎస్ 242 నుంచి 291 వరకూ ఉన్న బీఎల్‌వోలకు రూమ్ నం. 4లో శిక్షణ నిర్వహించనున్నారు. ఆయా తేదీల్లో సంబంధిత బీఎల్‌వోలు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



కరపత్రాలను అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కోవెలకుంట్ల: రవాణా రంగ కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సుధాకర్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9వ తేదీ నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని సోమవారం పట్టణంలోని కారు, జీపు డ్రైవర్లను కలిశారు. వాహనాల ట్యాక్స్ పెంచడం, కార్మికుల హక్కులను కాలరాస్తూ ప్రమాదకరమైన చట్టాలు తీసుకరావడం విచారకరమన్నారు. యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, సుధాకర్, నాగరాజు, గిరి, రమణ, శేఖర్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేద్దాం

సంజామల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 9న దేశవ్యాప్తంగా సమ్మెను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్, సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి సుజాత కోరారు. ఈ మేరకు సోమవారం సంజామల అంగన్‌వాడీ కేంద్రంలో సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించి కార్మికులకు నష్టం కలిగేలా వ్యవహరించిందని ఆరోపించారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

డోన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 76వ జయంతిని మంగళవారం డోన్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు తెలిపారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన స్వగృహంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించడంతో పాటు బేతంచెర్ల క్రాస్‌రోడ్డులోని సున్నపుబట్టీలు ప్రాంతం, కంబాలపాడు రోడ్డులోని వైఎస్సార్ సర్కిల్ వద్ద గల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

నివాళి

ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన డోన్ ఇందిరానగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇమాంబాషా (30) కుటుంబాన్ని పార్టీ నేతలు పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి బుగ్గన వ్యక్తిగత సహాయకుడు మహేశ్వరరెడ్డి, నియోజకవర్గ పార్టీ ఉపాధ్యక్షుడు కురుకుంద హరి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, పార్టీ నాయకులు వడ్డె రంగస్వామి, గద్దం సురేష్, సుంకన్న తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.

బనగానపల్లెలో మెగా రక్తదాన శిబిరం

బనగానపల్లె: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని బనగానపల్లెలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుండం నాగేశ్వరరెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 8 గంటలకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం సభ్యులు, అనుబంధ సంఘాల కన్వీనర్లు పెద్దఎత్తున మాజీ ఎమ్మెల్యే ఇంటికి చేరుకోవాలని కోరారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి, పెట్రోల్‌బంక్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తామన్నారు.

బేతంచెర్లలో..

బేతంచెర్ల: పట్టణంలో జరగనున్న వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలకు మండల ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 9 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి, పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు.

ఎమ్మార్పీఎస్‌తోనే ఎస్సీ వర్గీకరణ



డోన్ టౌన్: మందకృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం

డోన్ టౌన్/కొలిమిగుండ్ల/బేతంచెర్ల/సంజామల: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం డోన్, కొలిమిగుండ్ల, బేతంచెర్ల, సంజమాలలో ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు డప్పు వాయిద్యాలు, ర్యాలీలు, జెండా ఆవిష్కరణ చేశారు. పలుచోట్ల కేక్‌కటింగ్, మందకృష్ణమాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్‌తోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ సంఘాల నాయకులు ఉడుత చిరంజీవి, గరక మాదన్న, గూటం మారన్న, కంబగిరిరాముడు, రామచంద్రుడు, శ్రీనివాసులు, సురేష్, నాగన్న, మద్దిలేటి, అనీల్, చంద్రమోహన్, సల్మాన్, దాసు, రాముడు, వెంకట రాముడు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్వామినగర్ కాలనీలో సమితి జిల్లా నాయకులు రాజు, బందెల ఓబులేసు, కొమ్ము సుబ్బరాయుడు, నవీన్ ఆధ్వర్యంలో మాదిగల ఆత్మగౌరవ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

సర్టిఫికెట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ



బ్రోచర్స్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో బేసిక్ కంప్యూటర్స్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్ సర్టిఫికెట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత తెలిపారు. సోమవారం స్థానిక కళాశాలలో బ్రోచర్లను అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఇంటర్ పాస్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 12వ తేదీలోపు కళాశాలలో పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 15 నుంచి ఆగస్టు 16వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

బనగానపల్లెరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రచార కార్యదర్శి ప్రతాప్ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అరకొరగా నిధులు విడుదల చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నారాయణరెడ్డికి అందజేశారు.